RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:134 | మే 20, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260



## టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు

స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

2లో



# 8 ఏళ్లయినా.. దక్కని న్యాయం!

## 20ఏళ్ల కొడుకును పోగొట్టుకున్న తల్లిదండ్రుల మౌన రోదన

2లో


- విషప్రయోగం అని ఫోరెన్సిక్ రిపోర్టు
- 'న్యాచురల్ డెత్'గా మార్చేసిన పోలీసులు
- ఆధారాలున్నా నిందితులను అరెస్ట్ చేయకుండా కాలయాపన
- హెచ్ఆర్సీ యాక్షన్ తీసుకోమన్నా పట్టింపులేని ఖాకీలు
- అప్పటి వరంగల్ సీపీ రీ ఓపెన్ చేసినా కదలని కేసు
- చివరకు కొత్త డీజీపీ సర్ కు బాధితుల వేడుకోలు
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి న్యాయం చేయాలని డిమాండ్

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**


రక్షించాల్సిన రక్షక భటులే భక్షకులుగా మారితే.. న్యాయం చేయాల్సిన ఖాకీలే అక్రమార్కులకు కొమ్ముకాస్తే.. ఇక సామాన్యుడికి దిక్కెవరు? అన్యాయం జరిగితే పోలీస్ స్టేషన్ వైపు ఆశగా చూసే బాధితులకు, కొందరు స్వార్థపరులైన అధికారుల తీరు వల్ల నరకం కనిపిస్తోంది. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలే ఇది విషప్రయోగం అని చెప్తున్నా.. పోలీసులకు మాత్రం పట్టడం లేదు. చేతికి వచ్చిన 20 ఏళ్ల కొడుకును కోల్పోయి, కన్నప్రేమ కన్నీరుమున్నీరవుతుంటే.. ఎనిమిదేళ్లుగా ఆ తల్లిదండ్రులు తిరగని చోటు లేదు. ఉన్నతాధికారులు ఫైళ్లు రీఓపెన్ చేసినా.. చివరకు విష ప్రయోగాన్ని కాస్త సహజ మరణంగా మార్చేసి చేతులు దులుపుకున్న వైనం పోలీస్ శాఖకే మచ్చగా మారింది. తిరిగి అలిసిపోయిన ఆ వృద్ధ దంపతులు, చిట్టచివరి ఆశగా కొత్త డీజీపీ సీవీ ఆనంద్ వైపు న్యాయం కోసం దీనంగా చూస్తున్నారు. సర్.. మీరే న్యాయం చేయాలంటూ చేతులు జోడించి వేడుకుంటున్నారు.



డీజీపీ సర్.. మీరే న్యాయం చేయాలి



విష ప్రయోగం జరిగిందని ఫోరెన్సిక్ అందించిన నివేదిక



న్యాచురల్ డెత్ అంటూ నోటీసులో తెలిపిన పోలీసులు

## 'పాలమూరు-రంగారెడ్డి' స్పీడప్ చేయాలి

### భూసేకరణలో జాప్యం సహించబోం

- రైతులకు పరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలి
- సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలి
- ప్రాజెక్టులు పూర్తైతే వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక సమావేశం



**వేద న్యూస్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణలో అత్యంత ప్రతిష్ఠాత్మక సాగునీటి పథకాలలో ఒకటైన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పేర్కొంటూ, ఈ అంశంలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలమూరు ప్రాంత అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, భూసేకరణ పరిస్థితులు, నిధుల విడుదల వంటి అంశాలపై విస్తృతంగా

మిగతా 2వ పేజీలో

# నోట్ల కట్టలు.. బంగారం కుప్పలు!



## జలమండలి జీఎం ఇంట్లో ఏసీబీ అధికారుల దాడులు

- రూ.1.10 కోట్ల నగదు.. 2.1 కేజీల బంగారం, 9.2 కేజీల వెండి..
- కాస్ట్లీ విల్లాలు.. ఎకరాల కొద్దీ వ్యవసాయ భూములు..
- ఇవీ ఆయన అక్రమంగా సంపాదించిన ఆస్తుల చిట్టా
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కుమార్ అదుపులోకి..
- మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.5.88కోట్లు ఉంటుందని అంచనా
- అక్రమార్కుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్న ఏసీబీ ఉక్కుపాదం
- అయినా మారని లంచావతారులు

2లో

**వేద న్యూస్, క్రైం బ్యూరో**

సమాజంలో లంచగొండితనం ఎంతలా వేళ్లూనుకుపోయిందో, అవినీతి అధికారులు ఏ స్థాయిలో పెచ్చుమీరిపోతున్నారో చెప్పడానికి ప్రతిరోజూ ఏసీబీకి చిక్కుతున్న అవినీతి తిమింగలాలే సజీవ సాక్ష్యం. చట్టాలు కఠినతరమవుతున్నా, తోటి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికి జైలు గదుల్లో ఊచలు లెక్కపెడుతున్నా.. అక్రమార్కుల నైజంలో మాత్రం అణాపైసా మార్పు రావడం లేదు. భయం, భక్తి లేకుండా సామాన్య ప్రజల రక్తాన్ని తాగుతూ వందల కోట్లు కూడబెట్టడమే పరమావధిగా బతుకుతున్నారు. తాజాగా, హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ కుమార్ నివాసాలు, బినామీల ఇళ్లపై ఏసీబీ అధికారులు జరిపిన వ్యూహాత్మక మెరుపు దాడులు ఈ లంచగొండి వ్యవస్థకు నిలువుటద్దంగా నిలిచాయి. తెల్లవారుజామున 6 గంటలకే మొదలైన ఈ సోదాల్లో కుప్పలుగా నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, వెండి వస్తువులతో పాటు కోట్ల విలువైన ఆస్తి పత్రాలు బయటపడటంతో దాడులకు వెళ్లిన అధికారులే ఒక్కసారిగా ఖంగుతిన్నారు.

## ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు ఘనంగా చేయాలి

- శాఖల సమన్వయంతో పూర్తి చేయాలి
- ప్రముఖుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దు
- పకడ్బందీగా భద్రతా చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్
- పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహణకు అధికారులకు ఆదేశాలు

2లో



## అధ్వాన్నంగా.. గద్వాల్ సర్కార్ ఆస్పత్రి

- వారం రోజులుగా పనిచేయని మార్చురీ ఫ్రీజర్లు
- మృతదేహం భద్రత పరిచే విషయమై డాక్టర్, ఎస్ఐ మధ్య వాగ్వాదం

2లో

వేద న్యూస్

బుధవారం | మే 20, 2026

# ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు ఘనంగా చేయాలి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



జూన్ రెండో తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమై వేడుకల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్‌పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. పరేడ్ గ్రౌండ్, గన్‌పార్క్ వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి శాఖ నుంచి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రముఖుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్స్‌కు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని పోలీసు శాఖకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వాటర్‌ప్రూఫ్ షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. సభా ప్రాంగణంలో పారిశుధ్య పనులు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం కనిపించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అసెంబ్లీ, సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్‌తో పాటు ముఖ్య ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. వేడుకలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖకు సూచించారు. ఈ నెల ఇరవై ఐదో తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్స్‌లో అన్ని శాఖలు సంయుక్తంగా రిహార్సల్స్ నిర్వహించాలని వికాస్ రాజ్ స్పష్టం చేశారు.

## టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు

### డీఎంకే అధినేత, మాజీ సీఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**



తమిళనాడులో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వం అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన స్టాలిన్, రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం పూర్తి స్థాయి బలంతో లేదని, ఎప్పుడైనా రాజకీయ పరిస్థితులు మారవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. టీవీకే పార్టీ సొంతంగా నూట ఏడు స్థానాలు గెలుచుకోగా, మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోందని స్టాలిన్ పేర్కొన్నారు. కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ, ఇతర మిత్రపక్షాల మద్దతు ప్రస్తుతం ప్రభుత్వానికి కీలకమని వివరించారు. ఈ మద్దతులో మార్పులు చోటుచేసుకుంటే రాజకీయ అస్థిరత తలెత్తే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అలాగే తిరుగుబాటు చేసిన శాసన సభ్యులపై స్పీకర్ లేదా న్యాయస్థానాలు తీసుకునే నిర్ణయాలు కూడా పరిస్థితులను ప్రభావితం చేయవచ్చని తెలిపారు. రాజకీయ సమీకరణాల్లో చిన్న మార్పు కూడా రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గతంలో ఎన్నో ఎన్నికల ఓటముల తర్వాత కూడా డీఎంకే తిరిగి బలంగా పుంజుకుందని స్టాలిన్ గుర్తు చేశారు. ఈ ఓటమి శాశ్వతం కాదని, రాబోయే ఎన్నికల్లో పార్టీ తిరిగి విజయాన్ని అందుకుంటుందని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. తమిళనాడులో డీఎంకే గుర్తైన సూర్యుడు ఎప్పటికీ అస్తమించడని వ్యాఖ్యానించారు. సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని స్టాలిన్ తెలిపారు. ఒకప్పుడు టీ దుకాణాల్లో జరిగే రాజకీయ చర్చలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్నాయని పేర్కొన్నారు. పార్టీపై వచ్చే విమర్శలను సమర్థంగా తిప్పికొట్టాలని, కార్యకర్తలు డిజిటల్ వేదికల్లో మరింత చురుకుగా ఉండాలని సూచించారు.

## 'పాలమూరు-రంగారెడ్డి' స్పీడప్ చేయాలి

**మొదటి పేజీ తరువాయి**


చర్చించారు. ప్రతి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ నిధుల విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. భూములు కోల్పోయిన రైతులు, బాధితులకు సరైన సమయంలో పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాలు నిధుల కొరతతో నిలిచిపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. పనులు ఆగిపోకుండా అవసరమైన నిధులను విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాజెక్టుల పూర్తి విషయంలో నిర్లక్ష్యం లేదా ఆలస్యం సహించబోమని సంబంధిత అధికారులకు హెచ్చరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు రైతుల భవిష్యత్తును మార్చే శక్తి కలిగి ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల పరిస్థితి కూడా మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ రంగానికి ఇది కీలక మలుపుగా మారే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తూ ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో సాగునీటి వసతుల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఈ సమావేశం ద్వారా మరోసారి స్పష్టమైంది.

# 8 ఏళ్లయినా దక్కని న్యాయం!

## 20ఏళ్ల కొడుకును పోగొట్టుకున్న తల్లిదండ్రుల మౌన రోదన










- విషప్రయోగం అని ఫోరెన్సిక్ రిపోర్టు
- 'న్యాచురల్ డెత్'గా మార్చేసిన పోలీసులు
- ఆధారాలున్నా నిందితులను అరెస్ట్ చేయకుండా కాలయాపన
- హెచ్ఆర్‌సీ యాక్షన్ తీసుకోమన్నా పట్టింపులేని ఖాకీలు
- అప్పటి వరంగల్ సీపీ రీ ఓపెన్ చేసినా కదలని కేసు
- చివరకు కొత్త డీజీపీ సర్ కు బాధితుల వేడుకోలు
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి న్యాయం చేయాలని డిమాండ్

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

శాంతిభద్రతల పరిరక్షణే కాదు, బాధితులకు అండగా నిలవాల్సిన రక్షక భటులే అడ్డదారులు తొక్కుతూ బాధితులకు చుక్కలు చూపిస్తున్నారు. ప్రమాదం జరిగినా, అన్యాయం జరిగినా ప్రజలు ఆశగా పోలీస్ స్టేషన్‌కే పరిగెడతారు. కానీ, న్యాయం చేయాల్సిన అధికారులే నిందితులకు కొమ్ముకాస్తూ పోలీస్ శాఖ గౌరవాన్ని దిగజారుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 09 మే 2018 నాడు భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన ఆషాడపు దశరథం-లక్ష్మి దంపతుల కుమారుడు ఆషాడపు రాజేష్ (20) మిత్రుడి పెళ్లి బారాత్ లో డ్యాన్స్ చేస్తూ అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందాడు. చేతికి వచ్చిన కొడుకు అకాల మరణం వెనుక అనుమానాలు ఉన్నాయంటూ తండ్రి దశరథం స్థానిక వంగర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రాథమికంగా పోస్టుమార్టం నిర్వహించి, మృతుడి స్నేహితులైన తొమ్మిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం వచ్చిన ఫోరెన్సిక్ (ఎఫ్ఎస్ఎల్) ల్యాబ్ నివేదికలో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. రాజేష్ తాగిన బీరులో విషం ఉన్నట్లు, అది విషప్రయోగం వల్ల జరిగిన హత్యేనని ఫోరెన్సిక్ నివేదికలు తేల్చిచెప్పాయి. అయితే, ఇంత బలమైన ఆధారాలు ఉన్నప్పటికీ పోలీసులు నిందితులను అరెస్టు చేయకుండా తీవ్ర ఉదాసీనత ప్రదర్శించారని మృతుడి తండ్రి దశరథం ఆరోపిస్తున్నారు. కొడుకును కోల్పోయిన ఆ కన్నతల్లిదండ్రులు న్యాయం కోసం ఎక్కని మెట్లు, తిరగని ఆఫీసులు లేవు. ఈ సుదీర్ఘ పోరాటంలో న్యాయం దక్కకపోగా, వారిపై భారీగా ఆర్థిక భారం పడింది.

### అప్పటి సీపీ ఫైల్ రీఓపెన్ చేసినా..

మధ్యలో 2023లో వరంగల్ సీపీగా ఉన్న రంగనాథ్ స్పందించి ఈ ఫైల్‌ను రీఓపెన్ చేయించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రగతి కనిపించలేదు. మానవ హక్కుల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినా, ప్రజావాణిలో పదే పదే మొరపెట్టుకున్నా బాధితులకు చుక్కెదురే అయింది. దానికి పరాకాష్టగా, గత ఏప్రిల్ 8న వంగర ఎస్ హెచ్ఓ నుంచి బాధితులకు ఒక పోస్ట్ అందింది. అందులో రాజేష్ ది 'న్యాచురల్ డెత్' అని పేర్కొనడంతో ఆ తల్లిదండ్రులు ఖంగుతిన్నారు. ఫోరెన్సిక్ నివేదికలు విషప్రయోగం అని చెప్తుంటే, పోలీసులు దాన్ని సహజ మరణంగా ఎలా కొట్టేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

### డీజీపీ సర్ మీరే దిక్కు..

ఈ క్రమంలోనే, తమకు జరిగిన ఘోర అన్యాయాన్ని వివరిస్తూ కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీజీపీ సీవీ ఆనంద్‌కు బాధితులు ఇటీవల ఒక దీనమైన వినతి పత్రం సమర్పించారు. ఈ కేసుపై సిట్టింగ్ జడ్జితో లేదా ఉన్నత స్థాయి అధికారులతో లోతైన విచారణ జరిపించి, నిందితులను శిక్షించాలని, అలాగే కేసును పక్కదారి పట్టించిన పోలీసు అధికారుల ప్రమేయంపై కూడా విచారణ జరపాలని వారు వేడుకుంటున్నారు. ఎనిమిదేళ్లుగా న్యాయం కోసం అల్లాడుతున్న ఆ దంపతుల ఆఖరి ఆశ ఇప్పుడు డీజీపీ సర్ పైనే ఉంది. అసలు రాజేష్ ది పోలీసులు చెబుతున్నట్లు సహజ మరణమా? లేక ఫోరెన్సిక్ రిపోర్టు చెప్తున్నట్లు విషప్రయోగ హత్యనా? అనేది తేల్చాల్సిన బాధ్యత పోలీస్ ఉన్నతాధికారులపై ఎంతైనా ఉంది.

# నోట్ల కట్టలు.. బంగారం కుప్పలు!

## జలమండలి జీఎం ఇంట్లో ఏసీబీ అధికారుల దాడులు

**వేద న్యూస్, క్రైం బ్యూరో**

రాష్ట్రంలో అవినీతి అధికారులు రోజురోజుకూ పెచ్చుమీరిపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, చట్టాలు ఎంత కఠినంగా మారుతున్నా లంచగొండుల తీరులో మాత్రం ఏమాత్రం మార్పు రావడం లేదు. ఏసీబీ అధికారులు నిరంతరం దాడులు చేస్తూ, అవినీతి తిమింగలాలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని జైలు గదుల్లో వేస్తున్నా.. అక్రమార్కులు తమ పద్ధతి మార్చుకోవడం లేదు. లంచాలు తీసుకోవడం, వందల కోట్లు కూడబెట్టడమే పనిగా పెట్టుకుంటున్నారు. తాజాగా హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ కుమార్ నివాసాలపై ఏసీబీ అధికారులు జరిపిన మెరుపు దాడులు ఈ చేదు నిజాన్ని మరోసారి నిరూపించాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో అధికారులు ఇవాళ తెల్లవారుజాము నుంచి జరిపిన సోదాల్లో కోట్లలో నగదు.. కిలోల కొద్దీ బంగారం, విలువైన ఆస్తి పత్రాలు బయటపడగా.. అధికారులు ఒక్కసారిగా ఖంగుతిన్నారు.

### మారని నైజం.. పెచ్చుమీరుతున్న అవినీతి

తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాల్లో లంచగొండితనం వేళ్లూనుకుపోయిందనడానికి ఈ ఘటనే సజీవ సాక్ష్యం. సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని, తమ అధికారిక హోదాలను దుర్వినియోగం చేస్తూ కొందరు అధికారులు బెంబేలెత్తిస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపుతూ, వరుసగా రైడ్స్ నిర్వహిస్తున్నా అక్రమార్కులలో భయం అన్నదే లేకుండా పోయింది. తోటి అధికారులు లంచాలు తీసుకుంటూ జైలు పాలవుతున్న దృశ్యాలను కళ్లారా చూస్తున్నా, తమకు ఏమీ కాదనే ధీమాతో లంచాల వేటను కొనసాగిస్తూనే ఉన్నారు. సంపాదనపై ఉన్న అత్యాశతో వందల కోట్లు అక్రమ మార్గంలో సంపాదించడమే పరమావధిగా బతుకుతున్నారు.

### ఏసీబీ వ్యూహాత్మక దాడులు

జలమండలి జీఎం కుమార్ భారీగా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న బలమైన ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ రంగంలోకి దిగింది. అత్యంత పక్కా వ్యూహంతో మంగళవారం తెల్లవారుజామున 6 గంటలకే మల్లాపూర్ పరిధిలో ఉన్న జీఎం కుమార్ నివాసానికి ఏసీబీ ప్రత్యేక బృందాలు చేరుకున్నాయి. తనిఖీలు ప్రారంభించడమే కాకుండా, ఇంట్లో ఉన్నవారు ఎవరూ బయటికి వెళ్లకుండా, లోపలికి ఎవరూ రాకుండా ముందస్తుగా కఠిన చర్యలు తీసుకున్నారు. కుమార్ తన అక్రమ సంపాదనను దాచడానికి బినామీలను, బంధువులను వాడుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగానే ఆయనకు సంబంధించిన కీలకమైన వ్యాపార, వ్యక్తిగత నెట్‌వర్క్‌పై అధికారులు పూర్తిగా దృష్టి పెట్టారు.

### తవ్వేకొద్దీ అక్రమాస్తులు

ఈ దాడుల్లో భారీగా ఆస్తులు బయటపడినట్లు అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో మొత్తం 18 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు గుర్తించారు. అలాగే హైదరాబాద్‌లో 6 ప్లాట్లు, నిజామాబాద్‌లో 3 ఎకరాల భూమి, ఓ ఇంటికి సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రూ.1.10 కోట్ల నగదును కూడా అధికారులు పట్టుకున్నారు. కుమార్ నివాసంలో నిర్వహించిన తనిఖీల్లో 2.1 కిలోల బంగారం, 9.2 కిలోల వెండి వస్తువులు లభించాయి. అదనంగా కారు, బైక్‌లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ.5.88 కోట్లుగా అంచనా వేస్తున్నప్పటికీ, వాటి మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ వ్యవహారంపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, కుమార్‌కు సంబంధించిన ఇతర ఆస్తులపై కూడా విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

### మారని అధికారుల తీరు

చట్టాలు ఎంత కఠినంగా మారుతున్నా, తోటి అవినీతి అధికారులు ఏసీబీ వలకు చిక్కి జైలు పాలవుతున్న దృశ్యాలను కళ్లారా చూస్తున్నా లంచగొండుల నైజంలో మాత్రం ఏమాత్రం మార్పు రావడం లేదు. సమాజంలో లంచగొండితనం నరనరాన జీర్ణించుకుపోయిందనడానికి ప్రతిరోజూ జరుగుతున్న ఏసీబీ దాడులే సజీవ సాక్ష్యం. సామాన్య ప్రజల అవసరాలను, ఆవేదనను ఆసరాగా చేసుకుని తమ అధికారిక హోదాలను అడ్డం పెట్టుకుని వందల కోట్లు అక్రమ మార్గంలో సంపాదించడమే కొందరు అధికారులు పరమావధిగా పెట్టుకుంటున్నారు. సమాజానికి సేవ చేయాల్సిన స్థానాల్లో కూర్చుని, ప్రజాధనాన్ని దోచుకుంటూ బినామీల పేర్లతో ఆస్తులు, విలాసవంతమైన ఫ్లాట్లు కూడబెడుతూ వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారు.



గద్వాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ బయటే పడి ఉన్న మృతదేహం

# అధ్వాన్నంగా గద్వాల్ సర్కార్ ఆస్పత్రి

- వారం రోజులుగా పనిచేయని మార్చురీ ఫ్రీజర్లు
- మృతదేహం భద్రత పరిచే విషయమై డాక్టర్, ఎస్ఐ మధ్య వాగ్వాదం

**వేద న్యూస్, గద్వాల్ ప్రతినిధి**

జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే మార్చురీలో శీతలీకరణ ఫ్రీజర్లు పనిచేయడం లేదంటూ డ్యూటీ డాక్టర్ మృతదేహాన్ని స్వీకరించేందుకు నిరాకరించినట్లు సమాచారం. దీంతో డాక్టర్, ఎస్ఐ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవడంతో మృతదేహాన్ని భద్రపరిచినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాలను భద్రపరిచే శీతలీకరణ ఫ్రిజ్‌లు గత వారం రోజులుగా పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫ్రిజ్‌లు నిలిచిపోవడంతో మృతదేహాల సంరక్షణలో సమస్యలు ఎదురవుతున్నాయని సమాచారం. శీతలీకరణ వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ మరమ్మతులపై ఆసుపత్రి అధికారులు స్పందించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్చురీ పరిసరాల్లో దుర్వాసన వ్యాపిస్తోందని ఆసుపత్రికి వచ్చే ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రస్తుతం గుర్తుతెలియని మృతదేహాన్ని గంటల తరబడి మార్చురీ ముందు ఉంచిన ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. డాక్టర్లు, సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు సోషల్ మీడియాలో కూడా ప్రస్తావించారు. మృతదేహాల భద్రత విషయంలో అధికారులు తక్షణ చర్యలు తీసుకుని ఫ్రిజ్‌లను మరమ్మతు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణలో లోపాలపై జిల్లా వైద్యశాఖ స్పందించి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ‘ప్రసంగి‘ విద్యార్థుల అద్భుత ప్రతిభ

## రాష్ట్రస్థాయి పోటీలలో డాన్స్ స్టూడియో విజయఢంకా



**వేద న్యూస్, జమ్మికుంట:**

హన్మకొండలో నిర్వహించిన “డాన్సింగ్ స్టార్స్ 2026” రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలలో ప్రసంగి డాన్స్ స్టూడియో, ఫిట్నెస్ సెంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి.. పలు విభాగాలలో బహుమతులు సాధించారు. ఈ పోటీలకు ప్రముఖ సీనియర్ కొరియోగ్రాఫర్ మాస్టర్ చరణ్ జడ్జిగా వ్యవహరించగా, ముఖ్య అతిథిగా కుడా ఇనుగాల వెంకట్రాంరెడ్డి హాజరయ్యారు.ప్రసంగి డాన్స్ స్టూడియో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు కేవలం 20 రోజుల పాటు క్రమశిక్షణతో సాధన చేసి రాష్ట్రస్థాయి వేదికపై ప్రతిభ చాటడం విశేషం. చిన్నారులకు నృత్యంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సంస్కృతి, వేదికపై ప్రదర్శన నైపుణ్యాలను కూడా నేర్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.జమ్మికుంటలో చిన్నారుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రసంగి డాన్స్ స్టూడియో అనేక రాష్ట్రస్థాయి , జాతీయస్థాయి పోటీలలో విజయాలు సాధిస్తూ.. మంచి గుర్తింపు పొందుతోంది. డాన్స్‌తో పాటు జుంబా, ఫిట్‌నెస్, ఫోక్, క్లాసికల్ మరియు వెస్ట్రన్ డాన్స్‌లలో ప్రత్యేక శిక్షణ అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తోంది.సీనియర్ గ్రూప్ డాన్స్ విభాగంలో అశ్విత్ గ్రూప్ 2వ బహుమతి అందుకుంది. జూనియర్ డ్యూయెట్ డాన్స్ విభాగంలో లియాప్రసంగి, నాట్యప్రసంగి జంట 1వ బహుమతి సాధించగా, ప్రకృతి, రసజ్ఞ జంట 2వ బహుమతి గెలుచుకుంది.జూనియర్ సోలో డాన్స్ విభాగంలో ప్రకృతి 1వ బహుమతి, రసజ్ఞ 2వ బహుమతి సాధించారు. సీనియర్ సోలో డాన్స్ విభాగంలో లాస్య 2వ బహుమతి అందుకొని ప్రతిభ చాటుకుంది.ఈ విజయానికి శ్రమించిన మాస్టర్లను, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రసంగి డాన్స్ స్టూడియో డైరెక్టర్ శ్రీలత ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారం, గురువుల మార్గదర్శకత్వమే ఈ విజయానికి కారణమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ విజేతలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్థంభంపల్లి వద్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలన



**వేద న్యూస్, వెల్గటూర్:**

సాంఘిక సంక్షేమా శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం వెల్గటూర్ మండలంలోని స్థంభంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ గోళ్ళ తిరుపతి, ఎమ్మార్వోతో కలిసి యాదృచ్ఛికంగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మన్ పూధరి రమేష్ కూడా పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రంలో వడ్ల సేకరణ తీరును, రైతులకు అందుతున్న సౌకర్యాలను వారు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గోళ్ళ తిరుపతి మాట్లాడుతూ... రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఆయన పలు రైస్ మిల్లుల యజమానులతో ఫోన్లో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే వడ్ల లారీలను ఎలాంటి ఆలస్యం లేకుండా, వెంటనే దిగుమతి (అన్‌లోడ్) చేసుకోవాలని మిల్లుల యజమానులను ఆదేశించారు. “రైతులకు ఇబ్బంది కలిగిస్తే ఊపేక్షించేది లేదు. లారీల దిగుమతి ప్రక్రియ వేగవంతంగా సాగాలి.“ అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, లింగయ్య, ప్రముఖ నాయకులు ప్రశాంత్, స్థానిక రైతులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు రూ.10 లక్షల ఎల్ఓసి పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే



**వేద న్యూస్, అయిజ :**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ అయిజ మండల కేంద్రంలో మేడికొండ గ్రామానికి చెందిన ఈ.రాఘవేంద్ర గౌడ్‌కు రూ.5 లక్షలు, అలాగే పులికల్ గ్రామానికి చెందిన బోయ పవనికి రూ.5 లక్షల విలువైన ఎల్ఓసి పత్రాలను ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గల్ఫ్ బాధితులకు అండగా భూపతిరెడ్డి నియామకం



**వేద న్యూస్, నిజామాబాద్ ప్రతినిధి :**

తెలంగాణ ప్రభుత్వం ఎన్నారై పాలసీ పథకం అమలు అడ్వైజర్ కమిటీ లో నిజామాబాదు రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ ఆర్ భూపతి రెడ్డిని నియమించడం గల్ఫ్ బాధితులకు ఎన్నారై బాధిత కుటుంబాలకు న్యాయం చేకూరుతుందని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నర్సయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డాక్టర్ భూపతి రెడ్డి మొదట రాజకీయ రంగ ప్రవేశం చేసినప్పుడు తెలంగాణ ఉద్యమంలో గల్ఫ్ బాధితులే ఎక్కువ సంఖ్యలో ఉండేవారని అన్నారు. గల్ఫ్ బాధితుల గురించి పూర్తిస్థాయిలో తెలుసుకున్న నాయకులలో డాక్టర్ భూపతిరెడ్డి ఒక్కరు ఇలాంటి నేతకు అడ్వైజర్ కమిటీలో సభ్యులుగా ఉంచడం గల్ఫ్ బాధితులకు కొండంత అండగా ఉంటుందని వారు తెలిపారు. పేద ప్రజలు అట్టడుగు వర్గాల పై అవగాహన కలిగిన నేతగా ముఖ్యంగా గల్ఫ్ కార్మికులు వారి శ్రేయస్సుపై అవగాహన ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్న భూపతి రెడ్డికి స్థానం కల్పించడం హర్షనీయమని పేర్కొన్నారు. హైదరాబాదులోని ప్రజాభవన్ నుండి ఆంధ్ర ప్రదేశ్ లో రెండు రోజులపాటు పర్యటించడానికి వెళుతున్న డాక్టర్ భూపతి రెడ్డికి అక్కడి గల్ఫ్ బాధితులు స్వాగతం పలికి వారి సమస్యలను విన్నవించుకునే విధంగా వారితో అండగా ఉంటారని అర్థం అవుతుందని అన్నారు. తెలంగాణ ప్రజా భవన్ నుండి మొదటిసారి గల్ఫ్ బాధిత కుటుంబాలను వారి సాధక భాదలను తెలుసుకోవడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అక్కడి ఎన్నారై మంత్రిత్వ శాఖ ఆహ్వానించడం శుభ పరిణామమని తెలియజేశారు. ఆ శాఖ మంత్రివర్యులు అదేవిధంగా అడ్వైజర్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ సభ్యులు ఆంధ్రప్రదేశ్లో పర్యటించడం గల్ఫ్ బాధితులకు కొండంత అండగా నిలుస్తుందన్న నమ్మకం ఉందని అన్నారు.గల్ఫ్ బాధితులకు ప్రమాద బీమా మరియు 24 గంటలు హెల్ప్ లైన్ ఏర్పాటును చేయడం వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎన్ఆర్ఐ పాలసీ అమలులో అడ్వైజర్ కమిటీ మరింత ముందుకు సాగాలని కోరారు. ఈ కమిటీలో అనుభవజ్ఞులు ఉండడం వారిని నియమించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. డాక్టర్ భూపతిరెడ్డి 2001 నుండి నిజామాబాద్ జిల్లాలో గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకునే పాత్రలో ముందు నిలిచారని వైద్య సేవల ద్వారా కూడా వారి కుటుంబాలకు సేవలందించారని అన్నారు.

# విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలో రైడ్స్ సంస్థ వారు నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులలో భాగంగా మంగళవారం లయన్స్ క్లబ్ రుద్రూర్ వారి సహకారంతో విద్యార్థులకు లయన్స్ కంటి ఆసుపత్రి బోధన్ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 90 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను రాసి ఇవ్వడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. విద్యార్థులకు రాబోయే కాలంలో వారు ఎదగడాని కొరకు మోటివేషన్ క్లాస్ ని నిర్వహించడం జరిగింది. సీనియర్ లయన్స్ సభ్యులు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ యార్లగడ్డ శ్రీనివాస్ మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు గుండూరు ప్రశాంత్ గౌడ్, లయన్ కె.వి మోహన్, లయన్ సీనియర్ సభ్యులు లయన్ ఇందూర్ చంద్రశేఖర్, లయన్ శ్యామ్ సందర్ పహాడే, ప్రవీణ్ కారంగుల, లయన్ గెంటీల గంగాధర్, లయన్ ప్రశాంత్ పార్వతి, ఇతర లయన్స్ సభ్యులు, లయన్స్ కంటి ఆసుపత్రి బోధన్ వైద్యులు అజయ్, కోఆర్డినేటర్ హనుమంతరావు, రఫీ, రైడ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న స్టాక్ పాయింట్లను తనిఖీ చేసిన డీఎం



**వేద న్యూస్,కారేపల్లి :**

కారేపల్లి మండలంలోని మొక్కజొన్న స్టాక్ పాయింట్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ శాఖ డీఎం జే.నరేందర్ మంగళవారం తనిఖీ చేశారు. అప్పాయిగూడెం గోదాం, జిన్నింగ్ మిల్ స్టాక్ పాయింట్లను డీఎం పరిశీలించారు. సోమవారం రాత్రి కారేపల్లిలో రైతులు అందోళనకు దిగటంతో విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ రైతు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. కారేపల్లి మండల రైతుల మొక్కజొన్నను స్ధానికంగానే దిగుమతి చేయటానికి అవకాశాలు పరిశీలించాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే కోరారు. కలెక్టర్ ఆదేశాలతో మార్కెటింగ్ డీఎం గోదాంలను పరిశీలించారు. ఈసందర్భంగా సోసైటీ డైరక్టర్ అడ్డగోడ ఐలయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, దుగ్గి కృష్ణ, లు జిన్నింగ్ మిల్లు స్టాక్ పాయింట్‌లో కారేపల్లి మండల రైతులకు అవకాశం కల్పించాలని డీఎంను కోరారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌తో పోన్‌లో డీఎంతో మాట్లాడి స్ధానిక రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. డీఎం వెంట సోసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది ఉన్నారు.

# నేడు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

**వేద న్యూస్, నడికూడ:**

ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపికకు బుధవారం రోజున ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామ రామ కృష్ణ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు దరఖాస్తుదారులు దరఖాస్తు ఫారం తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్ లు తీసుకొని ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.



# రవీంద్ర భారతిలో ప్రతిభా పురస్కారాలు అందజేత



**వేద న్యూస్, శాయంపేట :**

**- పురస్కారం అందుకున్న బాసని అన్విత**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరి చిన విద్యార్థులకు ఐ ఫౌం డేషన్ ప్రతిభ పురస్కారాలను రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహించారు .మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాల మండల టాపర్ బాసని అన్వితను రవీంద్ర భారతిలో ఘనంగా మెమొరండం,జ్ఞాపక,శాలువా తో సత్కరించారు. తెలంగాణ రాష్ట్రం లో ప్రభుత్వ పాఠశా లల ప్రోత్సాహం కోసం హైదరబాదులోని రవీంద్ర భారతి లో ప్రతిభా పురస్కారాలు అందజేసే కార్యక్రమం ఘనం గా నిర్వహించారు .పది పరీక్షల్లో అత్యుత్తమ ప్రథమ స్థానం కనబరిచిన విద్యార్థులకు ఈ వేదికగా సత్కరించారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యా ర్థులకు సన్మా నించడం గర్వకారణమని తెలిపారు. ముఖ్య అతిధి ఎమ్మెల్సీ కోదం డరాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు సహజ తత్వం ఉంటుందని, పిల్లలు సమాజంలో సర్దుకుపోయే, సొంతంగా చదువుకునే స్వభావం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు శ్యామ ల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రొఫె సర్ కోదండరామ్, గిన్నిస్ బుక్ అవార్డు శాంతికృష్ణ, ఐ ఫౌండేషన్ అధ్యక్షులు రవీందర్, సామల వేణు, గంప వెంకటేశ్వర్లు, ప్రభాకర్, అమర్ నాథ్, డాక్టర్ గోపాలకృష్ణ మరియు సేవా సమితి , తెలంగాణ విటల్, 33 జిల్లాల ప్రధానోపాధ్యా యులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం మే 20 , 2026

# తిప్పాపురం గోశాలలో శ్రమదానం

**- 70 టన్నుల ఎండు గడ్డి నిల్వలో ఆలయ సిబ్బంది సేవాభావం**



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఉన్న తిప్పాపురం గోశాలలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రైతులు విరాళంగా అందించిన సుమారు 70 టన్నుల ఎండు గడ్డిని గోశాలలో భద్రపరిచే కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆధ్వర్యంలో ఈఈ, ఏఈ, ఏఈఓలు, పర్యవేక్షకులు, ఔట్సోర్సింగ్ సిబ్బంది మరియు కిందిస్థాయి ఉద్యోగులు ఉదయం 6 గంటల నుంచే పాల్గొని గడ్డి కట్టలను గోశాలలో సక్రమంగా వేరు చేసి నిల్వ చేశారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా సేవాభావంతో పనిచేసిన సిబ్బందిని ఈవో రమాదేవి ప్రత్యేకంగా అభినందించారు. గోమాత సేవ భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం కలిగి ఉందని, దేవస్థానం పరిధిలోని గోశాలలో పశువుల సంరక్షణకు అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా ఈవో తెలిపారు. భక్తులు, రైతులు అందిస్తున్న సహకారంతో గోశాల అభివృద్ధి మరింత బలోపేతం అవుతోందన్నారు. వేములవాడ దేవస్థానం కేవలం ఆధ్యాత్మిక సేవలకే పరిమితం కాకుండా గోసంరక్షణ, అన్నదానం, పర్యావరణ పరిరక్షణ వంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. తిప్పాపురం గోశాలలో నిర్వహించిన ఈ శ్రమదానం కార్యక్రమం ఆలయ సేవా తత్వానికి నిదర్శనంగా నిలిచిందన్నారు.

# చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి

**వేద న్యూస్ ,కారేపల్లి:**

గిరిజన హక్కుల సాధనలో మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు బెల్లయ్య నాయక్, మూడవత్ రాంబాల్ నాయక్, ఆధ్వర్యంలో ఈనెల 26న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన 'చలో హైదరాబాద్ మహధర్నా'ను గిరిజన సమాజం అంతా ఏకమై జయప్రదం చేయాలని ఎల్ హెచ్ పి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు బోడ మంగ్యాజీ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం కారేపల్లి మండల కేంద్రంలో మహధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆయన ముఖ్య నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోడ మంగ్యాజీ నాయక్ మాట్లాడుతూ, లంబాడి హక్కుల పోరాట సమితి ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ఈ ముప్పై ఏళ్ల కాలంలో అనేక గిరిజన సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాజీలేని పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. గిరిజనుల చిరకాల స్వప్నమైన "మా తండాలో మా రాజ్యం" లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో సాధించి చూపిన ఘనత ఎల్ హెచ్ పి.ఎస్ దే నని ఆయన గర్వంగా ప్రకటించారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయించడంలో ఎల్ హెచ్ పి ఎస్. పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ సంస్థ అందించిన స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది గిరిజన బిడ్డలు సర్పంచులుగా, జెడ్పీటీసీలుగా, ఎంపీపీలుగా, ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదిగారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఇచ్చిన "చేవెళ్ల డిక్లరేషన్" లోని 12 హామీలను తక్షణమే అమలు చేయాలని మంగ్యాజీ నాయక్ డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. తండాల ఆత్మగౌరవాన్ని, గిరిజనుల హక్కులను కాపాడుకోవడానికి, యువత, మేధావులు, ప్రజాప్రతినిధులు మరియు లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ చలో హైదరాబాద్ మహధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు,లకావత్ విను వికాస్, లకావత్ రాందాస్,భూక్యా నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుకు వెంటనే ఆమోదం తెలపాలి

**- నిరసన వ్యక్తం చేసిన జర్నలిస్టులు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ప్రభుత్వం జర్నలిస్టులపై చూపుతోన్న నిర్లక్ష్య ధోరణి జర్నలిస్టు వృత్తిని నిర్జీవం చేయడంగా మారిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( టీజేఎఫ్ )ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ తీవ్ర ఆవేదన తెలిపారు. పాత ప్రభుత్వం జారీ చేసిన జిఓ ప్రకారం ఖమ్మం జిల్లాకు 23.2 ఎకరాల భూమిని జర్నలిస్టులకు కేటాయించినప్పటికీ, ఇప్పటి పాలకులు వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ఇళ్ల స్థలాలు హౌసింగ్ సొసైటీ రూపంలో జర్నలిస్టులకు అప్పగించడంలో ఆలస్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి జర్నలిస్టును గుర్తించి అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని, హౌసింగ్ సొసైటీకి 23.2 ఎకరాల భూమిని అప్పగించి ఇళ్ల స్థలాల కేటాయింపు వెంటనే ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 21న జరగబోయే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఈ అంశంపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ నుంచి మయూరి సెంటర్ వరకు నిరసన మిశ్రమంగా నిర్వహించి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన తర్వాత జరిగిన సమావేశంలో యూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఎన్నోసార్లు వాగ్దానాలు చేశాయి కానీ అమలు చేయడంలో వెనుకబడ్డాయని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నిరసనలో సీనియర్ జర్నలిస్టులు రామిశెట్టి విజేత, జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యాధికారులు బిక్కి గోపి, అమరవరపు కోటేశ్వరరావు ,నగర, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, మహిళ జర్నలిస్టులు ఇతర నాయకులూ ఉన్నారు.




# ధర్మపురిలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

**- ఆధునిక పద్ధతులతోనే అధిక దిగుబడులు: మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి**

**వేద న్యూస్, ధర్మపురి :**



రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి సూచించారు. 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ'లో భాగంగా మంగళవారం ధర్మపురి పట్టణంలోని రైతు వేదికలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ నిబంధనల మేరకు పంటలను నమోదు చేసుకుని, సరైన సమయంలో విక్రయించుకోవాలని సూచించారు.

**వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి**

"రైతులు కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్ అవసరాలను బట్టి వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలి. అప్పుడే అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుంది." అని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, ఏఎంసి చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, వైస్ చైర్మన్ సంఘ నర్సింహులు, ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, హెచ్ఈఓ వంశీ, ఏఈఓ నవ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# అరుదైన ఎనిమిది అడుగుల శ్వేతనాగు

**వేద న్యూస్,వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ పట్టణంలోని భీమేశ్వరాలయం పక్క వీధిలో సోమవారం తెలుపు వర్ణం నాగుపాము ప్రత్యక్షమై స్థానికులను భయాందోళనకు గురి చేసింది. శర్మ ఇంటి ఆవరణలోని పశువుల పాక ప్రాంతంలో పాము కనిపించడంతో కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు. వెంటనే స్నేక్ క్యాచర్ జగదీశు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న జగదీశ్ జాగ్రత్తగా పామును పట్టుకొని, అనంతరం దానిని సమీప ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు.

# బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం కిటకిట..

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలి రావడంతో క్యూ లైన్లు కిక్కిరిసి పోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

# సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

**వేద న్యూస్, కోటగిరి :**



కోటగిరి మండలంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 20 నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు. కోటగిరి విండోలో 30 క్వింటాళ్లు, ఎత్తోండ విండోలో 30 క్వింటాళ్లు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఒక్క రైతుకు రెండున్నర ఎకరాలకు ఒక బస్తా, ఐదు ఎకరాలకు రెండు బస్తాల చొప్పున గరిష్ఠంగా రెండు బస్తాలు మాత్రమే అందజేయనున్నట్లు తెలిపారు.

# సింగరేణి భూముల వివాదంలో రైతులకు హైకోర్టు ఊరట

**- చట్ట ప్రకారం తప్ప భూముల నుంచి తొలగించవద్దని హైకోర్టు ఆదేశాలు**

**వేద న్యూస్ ,కారేపల్లి :**



ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామ రైతులకు తెలంగాణ హైకోర్టు కీలక ఊరటనిచ్చింది. తమ వ్యవసాయ భూములపై హక్కులు కలిగిన రైతులను చట్టబద్ధమైన ప్రక్రియ లేకుండా బలవంతంగా భూముల నుంచి తొలగించరాదని కోర్టు స్పష్టం చేసింది.రైతుల వాదన ప్రకారం, తమ పేర్లతో పట్టాదార్ పాస్‌బుక్లు, రికార్డ్ ఆఫ్ రైట్స్ పత్రాలు ఉన్న భూములను సరైన భూసేకరణ ప్రక్రియ లేకుండానే స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని టేకుల గూడెం సర్పంచ్ గుమ్మడి సందీప్ చొరవతో హైకోర్టు దృష్టికి రైతులు తీసుకెళ్లారు.ఈ సందర్భంగా, "భూమి స్వాధీనం, పునరావాసం మరియు పునరుద్ధరణలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం–2013" ప్రకారం భూసేకరణ చేయకుండా రైతుల భూముల్లో జోక్యం చేసుకోవడం చట్ట విరుద్ధమని కోర్టులో వాదనలు వినిపించబడ్డాయి.మరోవైపు, సింగరేణి సంస్థ తమ భూములను రక్షించుకునేందుకు మాత్రమే ఫెన్సింగ్ పనులు చేపడుతున్నామని కోర్టుకు తెలిపింది.రెండు పక్షాల వాదనలు విన్న హైకోర్టు, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ అవసరమని పేర్కొంటూ ప్రతివాదులకు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను 22 జూన్ 2026కు వాయిదా వేసింది.అంతవరకు, చట్ట ప్రకారం తప్ప రైతులను వారి భూముల నుంచి బలవంతంగా తొలగించరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఈ ఆదేశాలను స్థానిక రైతులు, ప్రజా సంఘాలు భూముల హక్కుల పరిరక్షణలో కీలక నిర్ణయంగా అభివర్ణిస్తున్నాయి.

# ఘనంగా ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్స్ దినోత్సవం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**




వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ .ఏ .రాజేంద్రప్రసాద్ గత 50 సంవత్సరాలు నుంచి వైద్యం చేస్తూ దాదాపు మా 40 ఫ్యామిలీకి ఫ్యామిలీ డాక్టర్ గా వైద్యం చేస్తున్నటువంటి సందర్భంగా వారికి చిరు సన్మానం చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి ఫ్యామిలీ డాక్టర్ గానే కాకుండా తమ ఇంట్లో ఒక కుటుంబ సభ్యునిగా ఉంటూ ఏ రాత్రి అంటే ఆ రాత్రి.. ఏ టైం అంటే ఆ టైంలో కూడా వైద్యం అందుబాటులో చేస్తూ వారసుల తర్వాత వారసులంటే మూడు తరాల వారికి కూడా వైద్యం అందిస్తూ సేవలు అందిస్తున్న సందర్భంగా వారికి కృతజ్ఞతాభావంగా అందరం కలిసి చిరు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అందరి కుటుంబంలో ఒక సభ్యునిగా భావించిన సందర్భంగా మనస్ఫూర్తిగా మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో తోను పునూరి అశోక్, అల్లాడి అప్పారావు, సంధ్యారాణి, ఇందుమతి, రాజేశ్వరి. శివాని, అల్లాడి కుమారస్వామి, గందె గోవిందరాజులు, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం మే 20 , 2026

# పారిశుద్ధ్య కార్మికుల పట్ల పట్టింపేది?

- పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి
- సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య



**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య సిబ్బంది కొన్ని నెలలుగా వేతనాలు రానివల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయినట్లు సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సాంబయ్య అన్నారు, ఆన్లైన్ కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన నెలకు రూ.9,500 గౌరవ వేతనాన్ని అందించాల్సి ఉన్నప్పటికీ కొందరు గ్రామపంచాయతీ పాలకవర్గాలు ఎత్తిపోసి, నెపం ప్రకారం రూ.7,000 మాత్రమే ఇచ్చే పనిని చేస్తున్నట్లు సిబ్బంది ఫిర్యాదు చేయడం దురదృష్టకరంగా ఉందని తెలిపారు. సాంబయ్య గ్రామపంచాయతీ పాలకవర్గాలు, కార్యదర్శులు వెంటనే చర్యలు తీసుకుని ఆన్లైన్ కార్మికులకు తగిన పూర్తి గౌరవ వేతనాన్ని చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది పనిలో స్థిరత్వం ఉండేలా, వారు గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమన్వయం కలిగి విధి నిర్వహణలో ముందుకు రావాల్సిన అవసరం ఉందని కూడా సూచించారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.ఆర్.పి.ఎస్. మండల అధ్యక్షుడు పరికి రత్నం, మామిళ్ల పెద్ద ఐలయ్య, కొంకటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రుద్రూర్ లో మెడికల్ షాపులు బంద్

**వేద న్యూస్, రుద్రూర్ :**



కేంద్ర ప్రభుత్వం 2018లో ఆన్ లైన్ లో మందుల అమ్మకాల కోసం తెచ్చిన జీఎస్ఆర్ 817, అలాగే కార్పొరేట్ వారికి ప్రత్యేక డిస్కౌంట్లు, నాసిరకం మందులు, మార్కెట్లోకి వస్తున్న వాటిపై కేంద్ర ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినప్పటికి స్పందించక పోవడంతో ఈ నెల 20న

మందుల దుకాణాలు బంద్ పాటిస్తున్నట్టు నిజామాబాద్ జిల్లా కె మిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అ ధ్యక్షులు నల్ల మదుసుధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీర్కూర్ సుధాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా రుద్రూర్ గ్రామ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ తారాబాయి, ఎస్సై సాయన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ జాతీయ సంస్థ అయిన ఏఐవోసీడి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఒకరోజు బంద్ పాటిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర సంస్థ అయిన టీటీడీసీఏ నిర్వహించిందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, సంతోష్, శంకర్, సుధీర్, అడప శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

**వేద న్యూస్ దేవరకద్ర :**



అమరచింత తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అమరచింత మండలం లోని చంద్రప్ప తాండ లో పుచ్చల పల్లి సుందరయ్య 41వర్ధంతిని మంగళ వారం నాడు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘశీ జిల్లా అధ్యక్షులు యస్. అజయ్ మాట్లాడుతు. 1 -మే-1913లొ నెల్లూరు జిల్లాలోని అలగని పాడు లొ బుస్వామ్యకుటుంబం లొ జన్మించిన సుందరయ్య. 19-మే-1985లొ మరణించరని గుర్తు చేశారు. దళితులకు మంచినీళ్లు ఇవ్వని కాలశీలో వారి ఇంటీ లోని బావి నిరు దళితుల కు అందించారానిభూమి లేని పేదలకు తన వాటా గా వచ్చిన దాన్ని పంచి పెట్టారని ఆయన సేవలను కొనియాడారు. పార్లమెంట్ కు సైకిల్ పై వెళ్లి ప్రజా సమస్య లపై నిరంతరం పోరాటాలకు నిలయం గా ఉన్నారని సమాజం కు నిస్వార్ధశీగా సేవ చేయాలనే సంకల్పం తో పిల్లలు కూడ వద్దు అనుకోని సమాజ సేవ కె నిరంతరం పరి తపించే వాడని అటువంటినేత ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లొ మండలఅధ్యక్షులు కె. శంకర్. రెడ్యానాయక్. బౌన్సింగ్ నాయక్. కృష్ణ నాయక్. కమలమ్మ గోవిందమ్మ. శంకరమ్మ. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవు

- వేములపల్లి ఎస్సై డి వెంకటేశ్వర్లు



**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

సోషల్ మీడియాలో ఇతర మనోభావాలకు దెబ్బతీసేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని వేములపల్లి ఎస్సై డి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోషల్ మీడియాలో పోస్టులు చేసేటప్పుడు వ్యక్తిగత గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవడం అవసరమన్నారు.హద్దు మీరిన విమర్శలు ద్వేషపూరిత పోస్టులు తీవ్ర పరిమాణాలు ఉంటాయని హెచ్చరించారు. రాజకీయ నాయకుల పై జర్నలిస్టులపై అసభ్యకరమైన సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారాలను వీడియో రూపంలో పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# నగల దొంగలు బస చేసిన విజయలక్ష్మి లాడ్జ్ సీజ్

**వేద న్యూస్, ధర్మపురి :**



నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న విజయలక్ష్మి లాడ్జను ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మంగళవారం సీజ్ చేశారు. ఇటీవల కరీంనగర్‌లోని పీఎంజే జువెలరీ షాప్‌లో జరిగిన భారీ దోపిడీకి సంబంధించిన దొంగలు ఈ నెల 1, 2 తేదీలలో జగిత్యాల జిల్లా ధర్మపురిలోని విజయలక్ష్మి లాడ్జ్‌లో ఆశ్రయం పొందినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. గోదావరి రోడ్డు వైపు ఉన్న ఈ విజయలక్ష్మి లాడ్జ ఎలాంటి ముందస్తు అనుమతులు, సరైన నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ధర్మపురి సీఐ రాము నరసింహారెడ్డి, ఎస్ఐ మహేష్ మరియు పోలీస్ సిబ్బందితో కలిసి భారీ బందోబస్తు మధ్య లాడ్జను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ లాడ్జ నిర్వాహకుడు నర్మల గుండయ్యకు నోటీసులు జారీ చేసి, లాడ్జను పూర్తిగా సీజ్ (తాళం వేసి) చేసినట్లు అధికారులు వెల్లడించారు. క్రిమినల్స్ ఆశ్రయం పొందేలా నిర్లక్ష్యంగా వ్యవహరించే ఇలాంటి సంస్థలపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

# ఇందల్వాయిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'..

- వానాకాలం వరి వంగడాలపై రైతులకు అవగాహన
- అధిక యూరియా వాడకంతో నేల ఆరోగ్యం దెబ్బతింటుంది: రుద్రూరు పరిశోధనా స్థాన శాస్త్రవేత్త డా. కృష్ణ చైతన్య

**వేద న్యూస్,ఇందల్వాయి :**



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంలోనీ ఇందల్వాయి గ్రామ "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 30 నుండి మే 23 వరకు కొనసాగే ఈ ప్రత్యేక ప్రచారంలో భాగంగా, రుద్రూరు చెరుకు మరియు వరి పరిశోధనా స్థాన శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక యూరియా వాడకం వద్దు పెట్టుబడి తగ్గించుకోండి. ఈ సందర్భంగా రుద్రూరు పరిశోధనా స్థాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. వ్యవసాయంలో లాభాలు గడించాలంటే రైతులు పెట్టుబడి ఖర్చులను నియంత్రించుకోవడం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా అవసరానికి మించి యూరియా వాడడం వల్ల నేలలోని సహజ పోషకాలు దెబ్బతింటాయని, ఇది పంట దిగుబడిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. రైతులు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు సమతుల్య ఎరువులను మాత్రమే వినియోగించి, అటు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ఇటు భూసారాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వానాకాలానికి సూచించిన వరి రకాలు ఇవే.. రాబోయే వానాకాలం సీజన్‌లో రైతులు ప్రభుత్వం అధికారికంగా సూచించిన రకాలను మాత్రమే సాగు చేయాలని అధికారులు స్పష్టం చేశారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి వారం రోజులు జైలు

- నిజామాబాద్ ఎక్సైజ్ కోర్టు తీర్పు - వివరాలు వెల్లడించిన ఇందల్వాయి ఎస్ఐ. జి. సందీప్




**వేద న్యూస్ ,ఇందల్వాయి:**

మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన శిక్షలు తప్పవని ఇందల్వాయి సబ్ ఇన్‌స్పెక్టర్ జి. సందీప్ హెచ్చరించారు. మండల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఒక వ్యక్తికి కోర్టు వారం రోజుల జైలు శిక్ష విధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్.ఐ తెలిపిన వివరాల ప్రకారం... వారం రోజుల క్రితం ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో డిచ్‌పల్లి మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన భూక్యా హరిచంద్ (45, తండ్రి: వసారామ్) మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పట్టుబడిన నిందితుడిని మంగళవారం నిజామాబాద్‌లోని స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి అహ్మద్ ఎదుట హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడికి 7 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అనంతరం పోలీసులు నిందితుడిని జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జి. సందీప్ మాట్లాడుతూ.. తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని, భవిష్యత్తులో తనిఖీలను మరింత తీవ్రం చేస్తామని స్పష్టం చేశారు.

# జర్నలిస్ట్ రాములు మరణం దురదృష్టకరం

**వేద న్యూస్, మహబూబునగర్ :**



వనపర్తి జిల్లాలోని గోపాల్ పేట మండలంలో జర్నలిస్టుగా ప్రజా సమస్యల కోసం నిరంతరం పరితపిస్తూ పనిచేస్తున్న జోగు రాములు అకాల మరణం జర్నలిస్ట్ లోకానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ టియుడబ్ల్యూజే ,(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రాములు మరణం తెలిసిన వెంటనే రాష్ట్ర కార్యదర్శి వెంట తెలంగాణ టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవరావు, రాజు, రాష్ట్ర హౌసింగ్ సైట్స్ మెంబర్ శ్రీనివాసరావు ఈశ్వర్, తదితరులు మరణించిన జర్నలిస్టు జోగు రాములు కుటుంబాన్ని పరామర్శించి జర్నలిస్టు సంఘం తరఫున రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ తో చర్చించి తగిన న్యాయం చేసి ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల, నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాలో జర్నలిస్టులు వృత్తిపరంగా అనేక ఒత్తిళ్లకు గురవుతూ ఉండే పోటు మరణాలు, డయాబెటిస్, రోడ్డు ప్రమాదాలతో మరణిస్తున్న సంఘటనలు జీర్ణించుకోలేక పోతున్నామని వెంటనే వృత్తిలో కొనసాగుతూ కారణాలతో మరణిస్తున్న జర్నలిస్టులను తెలంగాణలో అతిపెద్ద జర్నలి (ఐజేయు )జర్నలిస్టు సంఘం ఆదుకుంటుందని రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ తెలిపారు. ఇప్పటికే అనేక జర్నలిస్టు కుటుంబాలను తెలంగాణ టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ తరఫున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ ఆదుకున్న సంగతి గుర్తు చేశారు. జర్నలిస్టులు ఆత్మ ధైర్యం కోల్పోకుండా వృత్తి ధర్మాన్ని ఆత్మస్థైర్యంతో ముందుకు నడపాలని ఎవరు కూడా భయపడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అనేక సమస్యలు ఉన్నప్పటికీ ఆరోగ్యపరంగా విద్యాపరంగా వైద్య పరంగా అన్ని రంగాల్లో ( ఐజేయు )జర్నలిస్టు సంఘం ఆదుకుంటుందని ఆ విషయం ప్రతి ఒక్క జర్నలిస్టు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మృతి చెందిన జోగు రాములు కుటుంబాన్ని పరామర్శించారు.

# పెండింగ్ బిల్లుల చెల్లింపుకు ప్రభుత్వం సిద్ధం

## – పాలమూరు ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించిన ముఖ్యమంత్రి

**వేద న్యూస్, షాద్ నగర్ :**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులకు ఎమ్మెల్యేలకు స్వయంగా సూచించారు. మంగళవారం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని మంత్రులు జూపల్లి కృష్ణారావ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, రాకేష్ రెడ్డి, వంశీకృష్ణ, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారితో మాట్లాడినట్లు చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక సూచనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసినట్లు వీర్లపల్లి శంకర్ తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం పేర్కొన్నారని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఇతర సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మంత్రులు ఎమ్మెల్యేలు తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. జిల్లాలో సమస్యల పరిష్కారం పనుల్లో పురోగతిపై మంత్రుల



ఆధ్వర్యంలో తరచూ తనను కలవాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. ఇ భేటీ సందర్భంగా ఎమ్మెల్యే, రాష్ట్ర భద్రత సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పాలమూరు రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టు తీరుపై స్పందించి భూసేకరణ వాటికి చెల్లించాల్సిన బిల్లులతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేయడం ఎంతో శుభ పరిణామం అని తెలిపారు. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ఒక్కొక్కటిగా సమస్యలు తీరిపోతున్నాయని వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వయంగా ధన్యవాదాలు తెలియజేసినట్లు తెలిపారు..

# నిండుకుండలా తలపిస్తున్న నీటి ట్యాంకులు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్ గ్రామంలో ఎండాకాలంలో కూడా ఇంటింటి నీటి ట్యాంకులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. దీంతో గ్రామ మహిళలు సర్పంచ్ పిల్లల సందీప్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఆమనగల్ గ్రామంలో మాత్రం ముందస్తు చర్యలతో నీటి ఎద్దడి రాకుండా పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టిందని గ్రామస్తులు పేర్కొన్నారు. సర్పంచ్ కృషితో గ్రామంలో నిరంతర నీటి సరఫరా కొనసాగుతుండడం హర్షణీయమని వారు అన్నారు. అలాగే గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, మురుగు కాలువలను శుభ్రపరచడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం వంటి పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నారని మహిళలు తెలిపారు. ఎండాకాలంలో కూడా ఆమనగల్ చెరువు నిండుగా ఉండటం గ్రామ ప్రజలకు ఆనందాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా కొందరు గ్రామ పరిస్థితులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# ఇందల్వాయి పెద్ద చెరువు కబ్జాపై తాసిల్దార్‌కు వినతి

**వేద న్యూస్ ,ఇందల్వాయి:**



మండల కేంద్రంలోని చారిత్రాత్మక ఇందల్వాయి పెద్ద చెరువు కబ్జాకు గురవుతోందని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు తాహసిల్దార్ గుర్రపు బాలయ్యకు వినతిపత్రం సమర్పించారు. చెరువు శిఖం భూములను కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమిస్తున్నారని, దీనివల్ల చెరువు ఉనికి ప్రమాదంలో పడుతుందని వారు తాహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల వినతిపై తాహసిల్దార్ గుర్రపు బాలయ్య తక్షణమే స్పందించారు. కబ్జాకు గురైన చెరువు స్థలాన్ని వెంటనే గుర్తించాలని ఆయన సర్వేయర్‌ను ఆదేశించారు. తాహసిల్దార్‌తో పాటు సర్వే అధికారుల బృందం, ఇరిగేషన్ (నీటి పారుదల శాఖ) అధికారులు ఉమ్మడిగా ఇందల్వాయి గ్రామాన్ని సందర్శించనున్నారు. "ఎట్టి పరిస్థితుల్లోనూ పెద్ద చెరువు కబ్జాకు గురైన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటామని ప్రభుత్వ భూములను, చెరువులను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి సర్పంచ్ లోకాని గంగామణి, గంగారాం, ఉప్ప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వీడీసీ అధ్యక్షులు కాజపురం మహేందర్, మాజీ ఎంపీటీసీ సుధాకర్, మాజీ ఉప్ప సర్పంచ్ లింగంపల్లి రాజేందర్, కల్వరాల రఘుపతి, సున్నం నరేష్, భగీర్తి నారాయణ, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు లేకుండా వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలి

**వేద న్యూస్,నలగొండ ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ,మాదకద్రవ్యాల నియంత్రణతో పాటు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే విదంగా సమర్ధవంతగా పని చేయాలనీ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ పోలీస్ అధికారులతో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన పోక్సో, గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, పెండింగ్ కేసుల స్థితి, కోర్టు విచారణలు, నేరస్తులకు శిక్షలు పడేలా తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యు ఐ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి కోర్టుల్లో చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు అధికారులతో సమన్వయం చేస్తుకుంటూ సీసీ నంబర్లు పెండింగ్, వారెంట్ల అమలు, పెండింగ్ సమన్ల తక్షణ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఎన్డిపిఎస్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విదంగా పనిచేయాలని, మాదకద్రవ్యాల సరఫరా, రవాణా, వినియోగంపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యంగా నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలు, ప్రమాదకర కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మరింత ముమ్మరం చేయడంతో పాటు హెల్మెట్, సీట్ బెల్ట్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. దొంగతనాలు, చోరీలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాల నివారణకు రాత్రి, పగలు గస్తీలు నిర్వహించాలని, హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో రికవరీపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు స్వాధీనం చేసిన ఆస్తులను త్వరితగతిన అందజేయాలని సూచించారు. డయల్-100కు వచ్చే ప్రతి కాల్‌పై వెంటనే స్పందించి సంఘటన స్థలానికి తక్షణమే చేరుకోవాలని, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి కేసును బాధ్యతగా విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బ్యాంక్ మోసాలు, ఓటిపి మోసాలు, ఫేక్ లింకులు, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లపై గ్రామ స్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు పెంచేలా ప్రజలు, వ్యాపార సంస్థల




– జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్

యజమానులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, వీటి ద్వారా కేసుల ఛేదన వేగవంతం అవుతుందని తెలిపారు. పోలీస్ అధికారులు ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన సేవలు అందించాలని ఎస్పీ తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పోలీసులు పనిచేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. జిల్లాలో నేర నియంత్రణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా భద్రత అంశాల్లో మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి,సైబర్ క్రైమ్ డిఎస్పీ లక్ష్మినారాయణ, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 20 నుండి జెండా పండుగ ఉత్సవాలు

**వేదన్యూస్, శంకరపట్నం :**



తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవితక్క ఆదేశాల మేరకు ఈనెల 20 వ నుండి జూన్ 20 వ తేదీ వరకు తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో,టిఆర్ఎస్ జెండా పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకురాలు ఎం.డి సాల్మా అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అధికారపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పాలనలో పూర్తిగా విఫల మైందని, ప్రశ్నించే ప్రతిపక్షం గొంతు మూగబో యిందని,కావున ప్రశ్నించే గొంతుక అయిన కవితక్క నాయకత్వం తెలంగాణ రాష్ట్రానికి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆమె అన్నారు. కవితక్క నాయకత్వంలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే సామాజిక తెలంగాణ నిర్మాణం జరుగుతుందని వారు ధీమా వ్యక్తం చేసినారు. భవిష్యత్తులో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య,ఉచిత వైద్యం, రైతే రాజు,4 లక్షల ఉద్యోగాలు వంటి పథకాలు సామాన్య ప్రజలకు అందరికీ చేరుతాయని ఆమె అన్నారు.

# ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పణ

**వేద న్యూస్, ధర్పల్లి :**



మండల పరిధిలోని చల్లగరిగే గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక మాత ఎల్లమ్మ వారోత్సవాలు మంగళవారం తో ముగిశాయి. గౌడ సంఘం కు చెందిన మహిళలు ఇంటికొక బోనాలను తలపై ఎత్తుకొని ప్రధాన వీధుల గుండా వెళ్తూ ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని బోనాలను సమర్పించి, మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ.. గౌడ సంఘం కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్తులందరు, పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండే విధంగా చూడాలని మొక్కుకున్నట్లు వారు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి బ్రెయిన్ డెడ్

## – అవయవ దానంతో నలుగురికి పునర్జన్మ

**వేద న్యూస్ ఆలేరు/హైదరాబాద్:**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, బ్రెయిన్ డెడ్ అయిన ఒక యువకుడి కుటుంబం తీసుకున్న సాహసోపేత నిర్ణయం నలుగురి ప్రాణాలను నిలబెట్టింది. నల్గొండ జిల్లా ఆలేరుకు చెందిన పులిపాలుపుల మహేష్ కుమారుడు పులిపాలుపుల రాఘవ (20) జనగామలోని సీజేఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఈ నెల 16న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చెర్యాల్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ వద్ద ప్రమాదవశాత్తు రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాఘవ తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి, ఆపై మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యులు శ్రమించినప్పటికీ ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించడంతో ఈ నెల 18న రాఘవ బ్రెయిన్ డెడ్ (మస్తిష్క మరణం) అయినట్లు వైద్యులు ప్రకటించారు.

### కన్నీళ్లలోనూ కన్నతండ్రి ఉదారత

ఒక్కగానొక్క కొడుకు ఇక లేడనే చేదు నిజాన్ని జీర్ణించుకోలేక ఆ కుటుంబం గుండెకోతను అనుభవిస్తున్న సమయంలో.. రాఘవ తండ్రి మహేష్ ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. తన కొడుకు లోకాన్ని విడిచి వెళ్లినా, మరొకరి రూపంలో బతికే ఉండాలనే ఉద్దేశంతో అవయవ దానానికి ముందుకు వచ్చారు.



### దానం చేసిన అవయవాలు

జీవన్ దాన్ సంస్థ సమన్వయంతో రాఘవ శరీరం నుంచి సేకరించిన అవయవాలను నలుగురు బాధితులకు విజయవంతంగా అమర్చారు. కిడ్నీలు: 02, లివర్ (కాలేయం): 01 ఊపిరితిత్తులు (లంగ్స్): 01, తీవ్ర శోకంలో ఉండి కూడా సమాజ హితం కోసం, ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు ముందుకొచ్చిన పులిపాలుపుల రాఘవ కుటుంబ సభ్యులకు 'జీవన్‌దాన్ తెలంగాణ' సంస్థ తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ గొప్ప నిర్ణయం అవయవ దానంపై సమాజంలో మరింత చైతన్యాన్ని నింపుతుందని పేర్కొంది.

# మానవ శరీరమే రోగాలమయం..!

## – శుభ్రత పాటిస్తే అంతా సుఖమయం
## – జీవన శైలిలో మార్పులు,దేశ ప్రగతికి మేలు

**వేద న్యూస్, నిజామాబాద్ ప్రతినిధి :**

ఓరి నీ బడవ మహా విడ్డూరంగా ఉందేంటీ బామ్మ చెప్తూనే ఉండేది. నాయనా చేతులు కడుక్కుని బువ్వ తినరా అంటుంటే ఇంట్లో చొరబడి గబగబా అవ్వ చేసిన బువ్వను గొడ్డు కారంతో తినేసి ఇసుక దిబ్బలో ఆటకు బయలుదేరే వాళ్ళం. మట్టిలో మాణిక్యంలా గోలీలాడుతూ ఒళ్లంతా చెమటతో ఇళ్లకు చేరుకునే వాళ్ళం. రాత్రిల్లో అవ్వ ఒళ్ళో బజ్జునే వాళ్ళం పొద్దు, పొద్దుగాల కంటిలో నలకపడిన, కనురెప్పలు అతుక్కుపోయిన బామ్మ కంటి ఊసులను తీసేసి, ఇటుక పొడి తో పళ్ళు తోమేది కుంకుడు కాయలతో చన్నీటి తల స్నానం చేయించి, ఉతికిన లాగు చొక్కాను వేసేది. కళ్ళు ఎర్రబడితే గ్లాసు నీటిలో కనురెప్పలు కదిలించే వాళ్ళం ఇదంతా బామ్మ చెప్పిన చిట్కాలే ఒకప్పటి మందులు లేని మంత్రాలు. రోడ్డున పోయే జారు మిఠాయి చప్పరిస్తూ తినేవాళ్ళం. నిమ్మ గోళీలను కాకేంగిలి చేసి దోస్తుగాళ్ళకు పంచేవాళ్ళం బెల్లంతో చేసిన ప్యాలాల ముద్దలను ఇల్లు ఎదురుగా వున్నా సావుకారి దుకాణంలో బామ్మ ఇచ్చిన దుడ్లతో కొనుక్కుని దోస్తుగాళ్లతో ముచ్చటాడుతు ఇళ్లకు బయలుదేరే వాళ్ళం. ఇదంతా ఒకప్పుడు అండోయ్ ఇప్పుడు అంతా ఇళ్లకు పరిమితమై సాంకేతిక పరిజ్ఞానంలో మునిగిపోయారు. ప్లాస్టిక్ తో తయారు చేసిన బొమ్మలతో ఆడుకుంటున్నారు. తినే ఆహారమే మందుల మయం. పిజ్జాలు బర్గర్లు అంటూ కొత్త వాటికి మగ్గుచూపుతున్నారు. జబ్బు వచ్చేసరికి బోలెడంత సొమ్మును ధారపోసి ఆంగ్ల మందులను వాడుతున్నారు. 100 ఏళ్ళు బ్రతికే జీవితం కాస్త 50 నుండి 60 సంవత్సరాలకు దిగజారింది. "ప్రజలంతా డబ్బును వెతుకుతూ జబ్బులను కొని తెచ్చుకుంటున్నారు" తినే భోజనమే కల్తీ అయి అనేక రోగాలకు దారితీస్తుంది. దీని తస్స దియా శరీరమే రోగాలమయం అయిపోయింది. అంతుచిక్కని అనేక రోగాలు రాష్ట్రమంతటా వ్యాపించి గగ్గోలుపెడుతోంది. అమ్మ బాబోయ్ ఒకపుడు చేయి చూసి జబ్బు ఏంటో చెప్పేవారు అదంతా ఒకపుడండోయ్ ఇపుడుంతా ఆంగ్ల మందులే స్కానింగులు లేకుండా వ్యాధి పరీక్షలు చేయకుండా మందులు ఇచ్చేది లేదండోయ్ ఇదేదో విడ్డూరంగా ఉంది అనుకుంటారేమో ఇదే జరుగుతుంది. ప్రైవేట్ ఆసుపత్రుల మాయాజాలం. కంటి చూపు మందగిస్తే ఆకు కూరలు తిని ఆరోగ్యం బాగుచేసుకునేవాళ్ళం. ఆసుపత్రుల్లో ఇచ్చే కళ్ళజోడు ఒకప్పుడు ధరిస్తే, నా దోస్త్ గాల్లు ముసలవ్వ అని పిలుస్తు హేళన చేసేవాళ్ళు ఇప్పుడేమో కళ్ళజోడు ధరించడం కొత్తదనం అంటున్నారు. వయసు నిండకముందే ఈ కాలంలో కళ్ళజోడు వచ్చేసిందోయ్. ఆనాటి కాలంలో 80 ఏళ్లు దాటిన కళ్ళజోడు దాఖలు లేవు. మానవ శరీరమే రోగాలమయమై చీమల పుట్టల వలె ప్రతీ మనుషులందు పుట్టెడు రోగాలు. సొంత వైద్యానికి నోచుకోక తల్లడిల్లి పోతున్నారే! చేతులు కలిపే రోజులు పోయి తలదాచుకుని, కనులు మూసుకునే రోజులు వచ్చాయి. శుభ్రత లేనిదే రోజు గడవదు. ఇదేమి మాయాజాలం మనుషులతో ఆడుకుంటుంది.

# మత్స్యకారులకు సీఎం భరోసా

- వేట విరామ సాయంతో కుటుంబాలకు చేయూత
- తిరుపతిలో చెక్కుల పంపిణీ కార్యక్రమం
- కూటమి ప్రభుత్వం సంక్షేమానికి కట్టుబాటని ఎమ్మెల్యే వెల్లడి



**వేద న్యూస్, తిరుపతి :**

ప్రజా శ్రేయస్సు, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన "వేట విరామానికి సీఎం భరోసా" కార్యక్రమం మత్స్యకార కుటుంబాలకు పెద్ద అండగా నిలుస్తోందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో అందించిన ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేసి ఇరవై వేల రూపాయలకు పెంచి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్షా ముప్పై వేల మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక ఊరట లభిస్తోందని వివరించారు. తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన మత్స్యకారులకు వేట విరామ భృతి కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి, అధికారులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి మత్స్యకారులకు చెక్కులు పంపిణీ చేశారు. మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు, జిల్లా అధికారులు, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన సాయంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

# నేర నియంత్రణకు సాంకేతికత వినియోగం

- క్రైమ్ ప్రోన్ ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ
- జిల్లా వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు



**వేద న్యూస్, బాపట్ల :**

జిల్లాలో నేరాల నియంత్రణకు బాపట్ల పోలీసులు సాంకేతికతను వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా క్రైమ్ ప్రోన్ ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నేరాల నివారణతో పాటు అనుమానాస్పద కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచేందుకు ఈ చర్యలు చేపట్టారు. జిల్లాలో నేరాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా నేరస్తుల కదలికలను వేగంగా గుర్తించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఈ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డ్రోన్ కెమెరాల ద్వారా రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో నేరాల నియంత్రణకు ఈ విధానం మరింత ఉపయోగపడుతుందని పోలీసులు భావిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆధునిక పద్ధతులు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రధాన లక్ష్యమని జిల్లా పోలీసులు తెలిపారు. నేరస్తుల కదలికలను గుర్తించడం, అవసరమైన సమయంలో వెంటనే స్పందించడం కోసం డ్రోన్ నిఘా ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ సాంకేతిక ఆధారిత చర్యలను మరింత విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ప్రజల సహకారంతో నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఈ నిఘా వ్యవస్థ అమలులోకి రావడంతో ప్రజల్లో భద్రతాభావం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. నేర నియంత్రణలో ఇది కీలక పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతే ప్రధాన లక్ష్యం



- శక్తి యాప్‌పై అవగాహన
- అత్యవసర పరిస్థితుల్లో ఒక క్లిక్‌తో పోలీసు సహాయం
- విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలీసులు

**వేద న్యూస్, ప్రకాశం :**

మహిళలు, చిన్నారుల భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ప్రకాశం, మార్కాపురం జిల్లా పోలీసులు శక్తి యాప్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు వెంటనే పోలీసు సహాయం పొందేందుకు రూపొందించిన ఈ యాప్ వినియోగంపై ప్రజలకు వివరాలు తెలియజేస్తున్నారు. శక్తి యాప్ ద్వారా ప్రమాదకర పరిస్థితుల్లో ఒక క్లిక్‌తోనే పోలీసులకు సమాచారం చేరే విధానాన్ని మహిళలకు వివరించారు. ముఖ్యంగా విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళా సంఘాల సభ్యులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. భద్రత విషయంలో మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, విద్యాసంస్థలు, కార్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా ఉపయోగించాలి అనే అంశాలపై ప్రదర్శనలు కూడా నిర్వహిస్తున్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పోలీసులు పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేందుకు శక్తి యాప్ ఉపయోగపడుతుందని వివరించారు. ప్రజలు కూడా ఇలాంటి భద్రతా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు. మహిళలు ఎలాంటి భయాందోళనలు లేకుండా జీవించే వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలకు మహిళలు, యువత మంచి స్పందన ఇస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. శక్తి యాప్ వినియోగంతో అత్యవసర పరిస్థితుల్లో వేగంగా సహాయం అందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

# జలధార పనులకు గడువు

- జూన్ చివరికల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- నీటి కొరత ప్రాంతాలకు ట్యాంకర్లతో సరఫరా
- వీడియో సమావేశంలో అధికారులకు కలెక్టర్ సూచనలు



**వేద న్యూస్, కాకినాడ:**

జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జలధార జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించిన ఆయన, జిల్లాలో మంజూరైన పనుల పురోగతిపై సమీక్ష చేపట్టారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జలధార జలహారతి కార్యక్రమం కింద మంజూరైన అన్ని పనులకు గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనులు ఆలస్యం కాకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జూన్ ముప్పై నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లాలో తాగునీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని చెప్పారు. వేసవి తీవ్రత దృష్ట్యా నీటి సమస్యలు మరింత పెరగకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో జలధార కార్యక్రమం ప్రజలకు ఉపయోగపడేలా సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొని పనుల పురోగతిపై వివరాలు అందించారు. మంజూరైన పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన తాగునీటి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.

# హనుమాన్ విగ్రహం ధ్వంసం కలకలం

- న్యూ శాయంపేటలో ఘటనతో ఉద్రిక్తత
- రోడ్డుపై భక్తుల ధర్నాతో ట్రాఫిక్ స్తంభనం
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**వేద న్యూస్ హన్మకొండ :**

హన్మకొండ జిల్లాలోని న్యూ శాయంపేట సర్కిల్ పరిధిలో హనుమాన్ స్వామి విగ్రహం ధ్వంసమైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. విగ్రహం ధ్వంసం ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన హనుమాన్ భక్తులు ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో న్యూ శాయంపేట ప్రధాన రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని కోరారు. సమాచారం అందుకున్న బజరంగదళ్ కార్యకర్తలు, హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటున్నారు. ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఘటనతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

# హెచ్‌సీయూలో విద్యార్థి మృతి కలకలం



**వేద న్యూస్ హైదరాబాద్ :**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి మృతి ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మయాంక్ కుందు అనే విద్యార్థి యూనివర్సిటీ ప్రాంగణంలోని చెరువులో దూకి ప్రాణాలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మయాంక్ కుందు ఎంఏ ఎకనామిక్స్ తొలి సంవత్సరం చదువుతున్నాడు. యూనివర్సిటీ చెరువు వద్ద అనుమానాస్పద పరిస్థితుల్లో అతడి మృతదేహం కనిపించడంతో భద్రతా సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, యూనివర్సిటీలో గతంలో రెండు ల్యాప్‌టాప్‌ల దొంగతనాల ఘటనల్లో మయాంక్ పేరు వినిపించినట్లు తెలుస్తోంది. తాజాగా మరో ల్యాప్‌టాప్ కనిపించకపోవడంతో తనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయనే మనస్తాపానికి గురైనట్లు సహ విద్యార్థులు చెబుతున్నారు. ఈ మానసిక ఒత్తిడే అతడు ఆత్మహత్యకు దారితీసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు అధికారులు తెలిపారు.

# ఓటరు జాబితాలపై కీలక సమావేశం



**వేద న్యూస్ జగిత్యాల :**

జిల్లాలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్, విధివిధానాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు వేల ఇరవై ఆరు అక్టోబర్ ఒకటో తేదీని అర్హత తేదీగా పరిగణించి ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ పదిహేనో తేదీ నుంచి ఇరవై నాలుగో తేదీ వరకు ఓటరు జాబితా తయారీ, సిబ్బంది శిక్షణ, ముద్రణ ప్రక్రియలు చేపడతారని వివరించారు. జూన్ ఇరవై ఐదో తేదీ నుంచి జూలై ఇరవై నాలుగో తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని చెప్పారు. ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపుల ప్రక్రియలు ఈ సమయంలో చేపడతారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మార్పులపై కూడా ప్రతిపాదనలు స్వీకరిస్తామని తెలిపారు. జూలై ముప్పై ఒకటో తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఆ తర్వాత ఆగస్టు ముప్పై వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరిస్తామని కలెక్టర్ వివరించారు. అందిన అభ్యంతరాల పరిశీలన అనంతరం అక్టోబర్ ఒకటో తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు.పారదర్శకంగా, లోపరహితంగా ఓటరు జాబితాల తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ అంశాల్లో ప్రజలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయగా వాటిని నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

వేద న్యూస్

బుధవారం మె 20 , 2026

# ‘కాక్‌టెయిల్ 2’పై అంచనాలు పెరిగిపోయాయ్..!



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీబిజీగా గడుపుతోంది. ఒకవైపు పాన్ ఇండియా సినిమాలతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న ఈ నేషనల్ క్రష్.. ఇప్పుడు హిందీ చిత్ర పరిశ్రమలో కూడా తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్, స్టార్ హీరోయిన్ కృతి సనన్‌లతో కలిసి నటిస్తున్న ‘కాక్‌టెయిల్ 2’ సినిమా ప్రమోషన్స్‌లో ఆమె ఫుల్ బిజీగా ఉంది. ఈ చిత్రం జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో మేకర్స్ ఇప్పటికే ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా తాజాగా ముంబైలో చిత్రబృందం ఓ గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రష్మిక చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా మాట్లాడిన రష్మిక.. ‘కాక్‌టెయిల్ 2’ సాధారణ ప్రేమకథ కాదని, ప్రేక్షకుల ఊహలకు అందని విధంగా ఈ సినిమా ఉంటుందని తెలిపింది. “ఈ సినిమా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఇందులో భావోద్వేగాలు, ప్రేమ, రిలేషన్‌షిప్స్ అన్నీ కొత్త కోణంలో చూపించాం. ప్రేక్షకులు ఈ ప్రేమకథను ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు” అంటూ చెప్పుకొచ్చింది. అలాగే తన సహనటి కృతి సనన్ గురించి మాట్లాడుతూ.. “కృతి మామూలుగానే చాలా హాట్. కానీ ఈ సినిమాలో ఆమె మరింత అందంగా కనిపిస్తుంది. స్క్రీన్‌పై ఆమె ప్రెజెన్స్ అద్భుతంగా ఉంటుంది” అంటూ ప్రశంసలు కురిపించింది. ఇదే సమయంలో హీరో షాహిద్ కపూర్‌తో కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. “షాహిద్‌తో మా ఇద్దరి కెమిస్ట్రీ ఓ రేంజ్‌లో ఉంటుంది. అంటూ అభిమానుల్లో మరింత ఆసక్తి పెంచింది. ఇక ‘కాక్‌టెయిల్ 2’ సినిమా విషయానికొస్తే.. ఇది ఒక త్రిముఖ ప్రేమకథగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. ప్రేమ, స్నేహం, భావోద్వేగాల మధ్య జరిగే సంక్లిష్టమైన సంబంధాలను ఈ సినిమాలో చూపించనున్నట్లు సమాచారం. బాలీవుడ్‌లో విభిన్నమైన సినిమాలను తెరకెక్కించే దర్శకుడు హోమీ అదజానియా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో విడుదలైన ‘కాక్‌టెయిల్’ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే ఫ్రాంచైజీలో వస్తున్న ‘కాక్‌టెయిల్ 2’పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా షాహిద్ కపూర్, రష్మిక మందన్న, కృతి సనన్ వంటి స్టార్ కాస్టింగ్ ఈ సినిమాపై హైప్‌ను మరింత పెంచుతోంది. ఇటీవల బాలీవుడ్‌లో కూడా రష్మికకు మంచి డిమాండ్ పెరిగింది. ఇప్పటికే పలు భారీ హిందీ ప్రాజెక్టుల్లో నటిస్తున్న ఆమె.. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ తన మార్కెట్‌ను వేగంగా విస్తరిస్తోంది. ‘కాక్‌టెయిల్ 2’ విజయవంతమైతే రష్మిక బాలీవుడ్ కెరీర్‌కు ఇది మరింత బూస్ట్ ఇవ్వొచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఎన్టీఆర్ ‘డ్రాగన్’ గ్లింప్స్‌కు రంగం సిద్ధం

**వేద న్యూస్ డెస్క్:**

యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘కేజీఎఫ్’, ‘సలార్’ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల తర్వాత ప్రశాంత్ నీల్ రూపొందిస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఇప్పుడు ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భారీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం అభిమానులకు ప్రత్యేక సర్‌ప్రైజ్ సిద్ధం చేసింది. ఈ రోజు అర్ధరాత్రి 11 గంటల 52 నిమిషాలకు ఈ చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం. డిజిటల్ వేదికలతో పాటు ఎంపిక చేసిన థియేటర్లలో కూడా ఈ గ్లింప్స్‌ను ప్రత్యేకంగా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు ‘డ్రాగన్’ అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు సినీ వర్గాల్లో బలమైన ప్రచారం జరుగుతోంది. ఇటీవల సెన్సార్ బోర్డు వెబ్‌సైట్‌లో ‘గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్’ పేరుతో సర్టిఫికెట్ నమోదైనట్లు వార్తలు రావడంతో ఈ టైటిల్‌పై మరింత చర్చ మొదలైంది. దీంతో ఈ రాత్రి విడుదల కానున్న గ్లింప్స్‌లోనే టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు. సాధారణంగా ఒక సినిమా గ్లింప్స్ లేదా టీజర్ ఒకటి లేదా రెండు నిమిషాల వ్యవధిలో ముగుస్తుంది. కానీ ఈసారి ప్రశాంత్ నీల్ పూర్తి భిన్నంగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ గ్లింప్స్ నిడివి ఏకంగా నాలుగు నిమిషాల ముప్పై ఐదు సెకన్లు ఉండబోతున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. సినిమా ప్రపంచాన్ని, కథా నేపథ్యాన్ని ప్రేక్షకులకు బలంగా పరిచయం చేయడానికే ఇంత భారీ నిడివితో గ్లింప్స్ రూపొందించినట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ సినిమాల్లో భారీ ఎలివేషన్స్, మాస్ యాక్షన్, డార్క్ విజువల్స్ ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తాయి. ఈ సినిమాలో కూడా ఎన్టీఆర్‌ను పూర్తిగా కొత్త అవతారంలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగాలు, భారీ స్థాయి విజువల్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.



# శివకార్తికేయన్ కొత్త సినిమా ప్రారంభం

**వేద న్యూస్ డెస్క్:**




తమిళ సినీ పరిశ్రమలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ నటుడు శివకార్తికేయన్ ఇప్పుడు మరో భారీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఇటీవల విడుదలైన ‘అమరన్’ చిత్రం అద్భుత విజయాన్ని అందుకోవడంతో ఆయన మార్కెట్ మరింత పెరిగింది.

యాక్షన్, భావోద్వేగాలు, దేశభక్తి అంశాల కలయికతో రూపొందిన ఆ సినిమా తమిళంతో పాటు ఇతర భాషల్లోనూ మంచి ఆదరణ పొందింది. ఆ విజయోత్సాహంలోనే ఇప్పుడు ఆయన నటిస్తున్న కొత్త చిత్రం ‘సెయాన్’పై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నటుడు కమల్‌హాసన్‌కు చెందిన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కమల్‌హాసన్‌తో పాటు ఆర్.మహేంద్రన్ ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. దర్శకుడు శివకుమార్ మురుగేశన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సోమవారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ అధికారికంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త పోస్టర్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. విడుదలైన పోస్టర్‌లో శివకార్తికేయన్ చాలా పవర్‌ఫుల్ అవతారంలో కనిపిస్తున్నారు. గుబురు గడ్డం, తీవ్రమైన చూపులు, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే నేపథ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇప్పటివరకు కుటుంబ కథా చిత్రాలు, వినోదాత్మక సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శివకార్తికేయన్ ఈసారి పూర్తి భిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో ఆయన పాత్ర చాలా బలంగా ఉండబోతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమా గురించి చిత్రబృందం కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించింది. మాస్ అంశాలతో పాటు ఆధ్యాత్మికత, సంస్కృతి, గ్రామీణ జీవన విధానం కలిసిన కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. పల్లెటూరి సంప్రదాయాలు, కుటుంబ బంధాలు, గ్రామీణ భావోద్వేగాలు కథలో ప్రధాన భాగంగా ఉండనున్నాయని సమాచారం. ముఖ్యంగా గ్రామీణ నేపథ్యంలో వచ్చే యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులోని పల్లె సంస్కృతిని సహజంగా తెరపై చూపించే ప్రయత్నం ఈ సినిమాలో చేస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కథలో భావోద్వేగాలకు పెద్దపీట వేస్తూనే, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే ఎలివేషన్ సన్నివేశాలను కూడా చేర్చనున్నట్లు తెలుస్తోంది. శివకార్తికేయన్ కెరీర్‌లో ఇది మరో మైలురాయి చిత్రంగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో వచ్చే సినిమాలకు ఆయన అందించే సంగీతం ప్రత్యేక గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో పాటలు, నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక కమల్‌హాసన్ నిర్మాణంలో ఈ సినిమా తెరకెక్కుతుండటంతో సినీ వర్గాల్లో మరింత ఆసక్తి పెరిగింది. గతంలో విభిన్న కథాంశాలతో ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన రాజ్‌కమల్ సంస్థ మరోసారి కొత్త తరహా కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ‘అమరన్’ తర్వాత శివకార్తికేయన్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో తమిళ ప్రేక్షకులతో పాటు తెలుగు ప్రేక్షకుల్లో కూడా ఈ సినిమాపై మంచి ఆసక్తి నెలకొంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన హీరోయిన్, ఇతర నటీనటులు, విడుదల తేదీ వంటి వివరాలను చిత్రబృందం అధికారికంగా ప్రకటించనుంది.

# శ్రీదేవిపై నాని ఆసక్తికర వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**



తెలుగు సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న నటుడు నాని ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకు పోతున్నారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండానే పరిశ్రమలోకి అడుగుపెట్టి, తన ప్రతిభతో స్టార్ హీరో స్థాయికి ఎదిగిన ఆయన ఇప్పుడు నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల విడుదలైన ‘హిట్ 3’ సినిమాతో మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్న నాని ప్రస్తుతం భారీ బడ్జెట్ చిత్రం ‘ది పారడైజ్’ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాని తనకు ఎంతో ఇష్టమైన హీరోయిన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దివంగత నటి, అతిలోక సుందరి శ్రీదేవి అంటే తనకు ఎంతో అభిమానమని, ఆమెను తాను ఎంతగానో ఆరాధిస్తానని వెల్లడించారు. నాని మాట్లాడుతూ.. “నాకు శ్రీదేవి గారంటే చాలా ఇష్టం. నిజం చెప్పాలంటే ఆమెపై నాకు పిచ్చి. ఆమె నటన, అందం, తెరపై కనిపించే తీరు అన్నీ నాకు చాలా ప్రత్యేకంగా అనిపిస్తాయి. శ్రీదేవి, వెంకటేష్ కలిసి నటించిన ‘క్షణక్షణం’ సినిమా నేను ఎన్ని సార్లు చూశానో నాకే తెలియదు. లక్ష సార్లు చూసినా కూడా మళ్లీ చూడాలనిపించే సినిమా అది” అని తెలిపారు. అంతేకాకుండా “అసలు శ్రీదేవి అంత అందంగా ఎలా ఉన్నారో ఇప్పటికీ నాకు అర్థం కావడం లేదు. ఆమె తెరపై కనిపించిన ప్రతిసారి ప్రేక్షకులు మంత్ర ముగ్ధులైపోయేవారు. ‘క్షణక్షణం’ సినిమాకు శ్రీదేవి అందం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ సినిమాలో ఆమె నటన, హావభావాలు, స్టైల్ అన్నీ ఇప్పటికీ గుర్తుండిపోతాయి” అంటూ తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఇక ప్రస్తుతం నాని నటిస్తున్న ‘ది పారడైజ్’ సినిమా గురించి సినీ వర్గాల్లో భారీ చర్చ జరుగుతోంది. ‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నాని కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమా సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. రీషూట్లు లేకుండా అనుకున్న ప్రణాళిక ప్రకారమే సినిమా షూటింగ్ కొనసాగుతోందని చిత్రబృందం తెలిపింది. నాని కెరీర్‌లోనే ఇది అత్యంత ప్రతిష్టాత్మక చిత్రంగా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు.

# సింపుల్ బ్యూటీ సీక్రెట్స్.. లయ ఆసక్తికర వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**



ఒకప్పుడు తెలుగు తెరపై తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి లయ తాజాగా తన ఆరోగ్య రహస్యాలు, ఆహార అలవాట్ల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తాను ఎన్నో సంవత్సరాలుగా పాటిస్తున్న జీవనశైలి గురించి వివరించారు. అయితే ఇవి ఎవరికీ సలహాలు కావని, తన శరీరానికి సరిపోయే అలవాట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. తాను సాధారణంగా అల్పాహారం చేయనని లయ తెలిపారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ సమయం, మధ్యాహ్న భోజనం సమయం మధ్య ఎక్కువ గ్యాప్ లేకపోవడంతో బ్రేక్‌ఫాస్ట్ తనకు సూట్ కాదని చెప్పారు. ఉదయం లేవగానే వంట పనులు మొదలుపెట్టి, సుమారు 11 గంటల ప్రాంతంలో వంట పూర్తయ్యాక నేరుగా భోజనం చేస్తానని తెలిపారు. అదే తనకు లంచ్‌గా మారుతుందని చెప్పారు. ముఖ్యంగా అమెరికాలో ఇంటి నుంచే పనులు చేసుకునే సందర్భాల్లో ఈ రొటీన్‌ను క్రమంగా పాటిస్తానని వెల్లడించారు. లంచ్ ముందుగానే చేయడం వల్ల మధ్యలో స్నాక్స్, జంక్ ఫుడ్ లేదా ఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోనని లయ పేర్కొన్నారు. సీజన్‌లో దొరికే పండ్లు ఉంటే మాత్రం అప్పుడప్పుడు తింటానన్నారు. సాయంత్రం 6 లేదా 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి మరోసారి భోజనం చేస్తానని చెప్పారు. రోజుకు రెండు పూటలే భోజనం చేయడం తనకు అలవాటైందని వెల్లడించారు. ఆహారంలో ఎక్కువగా కూరగాయలు, పప్పులు ఉంటాయని లయ చెప్పారు. ముగ్గురు లేదా నలుగురికి సరిపడే కూరను తాను ఒక్కరే తినేస్తానని నవ్వుతూ తెలిపారు. అన్నం మాత్రం చాలా తక్కువగా తీసుకుంటానని, కేవలం కూరతో భోజనం చేసిన భావన రాకుండా ఉండటానికి మాత్రమే కొద్దిగా అన్నం తింటానని వివరించారు. చిన్నప్పటి నుంచి పెరుగు తినే అలవాటు ఉందని, ఇప్పటికీ దాన్ని కొనసాగిస్తున్నానన్నారు. తాను పాలు, కాఫీ, టీ తాగనని చెప్పిన లయ.. కాల్షియం కోసం గ్రీక్ యోగర్ట్ తీసుకుంటానని వెల్లడించారు. అందులో ప్రోటీన్ ఎక్కువగా ఉండటంతో అది ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. తాను పూర్తిగా శాకాహారినని, శాకాహారులకు ప్రోటీన్ పొందడం ఒక సవాలే అయినప్పటికీ.. సరైన ఆహార అలవాట్లతో అది సాధ్యమవుతుందని చెప్పారు. సీజనల్ పండ్లంటే తనకు ఎంతో ఇష్టమని లయ తెలిపారు. వేసవిలో మామిడిపండ్లు, ఇతర కాలాల్లో సీతాఫలాలు, నేరేడు పండ్లు, పనసకాయలు మాత్రమే తీసుకుంటానని చెప్పారు. అన్ని కాలాల్లో దొరికే పండ్లకంటే సీజన్‌లో వచ్చే సహజమైన పండ్లనే ఇష్టపడతానన్నారు. ఇదే తన ఆరోగ్యం, చర్మ సౌందర్యానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బ్యూటీ కేర్ విషయానికి వస్తే.. తాను చాలా సింపుల్ రొటీన్‌ను మాత్రమే ఫాలో అవుతానని లయ తెలిపారు. ఫేస్ వాష్, మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ మాత్రమే వాడుతానని, అదనంగా సీరమ్స్ లేదా రసాయన ఉత్పత్తులు ఉపయోగించనని చెప్పారు. చర్మంపై అవసరం లేని ప్రయోగాలు చేయకుండా సహజత్వాన్ని కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇస్తానని వెల్లడించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073